క్లుప్తంగా

రంజాన్ మాసం ప్రారంభం

ప్యాపిలి: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం శనివారం ప్రారంభమైనట్లు ప్రభుత్వ ఖాజీ మహబూబ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన తరావీ నమాజ్‌లో ముస్లింలు పాల్గొన్నారు. ఆదివారం నుంచి 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించనున్నారు.

ఏఐవైఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, సంఘం నేతలు

డోన్ రూరల్: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాకేష్ చేతుల మీదుగా శనివారం ఏఐవైఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల దించుకుని చదివితే అదే చదువు తలెత్తుకునేలా చేస్తుందన్నారు. చేడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, మండల కార్యదర్శి పృథ్వీకుమార్, హరికృష్ణ, దివాకర్, నాగరాజు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

డోన్ టౌన్: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఫిబ్రవరి 23వ తేదీ నిర్వహించిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డోన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. కటా విభాగంలో పీయూష్, చరణ తేజ్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. విజేతలను స్కూల్ యజమాన్యం శనివారం సత్కరించింది. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయిని శకుంతల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



నందివర్గంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. మండలంలో వివిధ రకాల పింఛన్లు 12,298 ఉండగా సాయంత్రం వరకు 93 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. వారి వెంట ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆలయానికి 4 ఎకరాల విరాళం



దాత పద్మావతమ్మను సత్కరిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బైనపల్లె నాగమల్లేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన మిట్ట నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య పద్మావతమ్మ 4 ఎకరాల పొలం విరాళంగా ఇచ్చారు. లక్షల విలువ చేసే పొలాన్ని ఆలయానికి అందజేయడంపై ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పద్మావతమ్మను సత్కరించారు. అలాగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పాణ్యం మండలం పిన్నాపురం వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. బేతంచెర్ల ద్వితీయ, వెల్దుర్తి మండలం బొయినపల్లె తృతీయ, బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె నాల్గవ, బేతంచెర్ల 5వ, వెల్దుర్తి మండలం బొయినపల్లె 6వ స్థానం కై వసం చేసుకున్నాయి. దాతల సహకారంతో వరుసగా రూ. 25 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ. 3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.



బండలాగుడు విజేతలకు నగదు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ఆదాయం ఫుల్.. వసతులు నిల్



అవుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వచ్చిన ప్రజలు

- అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసతులు కరువు
- తాగునీరు, మరుగుదొడ్డి లేక అవస్థలు

అవుకు: మండల కేంద్రం అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమస్యలకు నిలయంగా మారింది. కనీస వసతులు కరువై ఉద్యోగులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన మరుగుదొడ్డికి పైకప్పు లేకపోవడంతో పాటు చుట్టు పక్కల ఇళ్ల నిర్మాణాలు జరగడంతో వాడుకకు దూరమైంది. అంతేకాకుండా మరుగుదొడ్డి చుట్టూ ముళ్లపొదలు పెరిగాయి. అవుకు మండలంతో పాటు సంజామల, కొలిమిగుండ్ల మండలాల నుంచి ప్రజలు ఆస్తి క్రయ విక్రయాలు, వీలునామా తదితర దస్తావేజులు చేయించుకోవడానికి రోజూ పదుల సంఖ్యలో వస్తుంటారు. ఈ కార్యాలయంలో ఏడాదికి 3 వేల నుంచి 4 వేలల్లో వివిధ రకాల దస్తావేజులు జరుగుతుంటాయి. ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.కోటికి పైగానే ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి ప్రజల ద్వారా ఇంత ఆదాయం వస్తున్నా.. కార్యాలయంలో కనీస వసతులు ఉన్నాయా.. లేవా... అని పట్టించుకునేవారే లేరని ప్రజలు వాపోతున్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి ఉదయం వస్తే సాయంత్రం వరకు ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు లేకపోతే ఎలా అని కార్యాలయానికి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల పరిస్థితి బాధలు వర్ణనాతీతం. పైగా ఇదే కార్యాలయంలో ఇద్దరు మహిళా ఉద్యోగులు కూడా ఉన్నారు. ప్రజల ఇబ్బందులను గ్రహించి అవుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాని ప్రజలు కోరుతున్నారు.



పాడుబడిన మరుగుదొడ్డి

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



డోన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్న ఇంటర్ విదార్థులు



బేతంచెర్ల: విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం నుంచి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, సాంస్కృతం, హిందీ పరీక్షలు జరిగాయి. డోన్‌లో మొత్తం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల 314 మంది విద్యార్థులకు గాను 305 మంది హాజరయ్యారు. అలాగే మోడల్ స్కూల్‌లో 272 మందికి గాను 265, శ్రీసుధ జూనియర్ కళాశాలలో 384 మందికి గాను 370, వెంకటేశ్వర కళాశాలలో 302 మందికి గాను 293 మంది హాజరయ్యారు. మొత్తం 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ చౌడప్ప నాలుగు కేంద్రాలను తనిఖీ చేశారు.

బేతంచెర్లలో 34 మంది గైర్హాజరు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలకు విద్యార్థులు అర్థగంట ముందుగానే 8:30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. మొత్తం 559 మంది విద్యార్థులకు గాను 525 మంది హాజరు కాగా 34 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియదాసు తెలిపారు.

ప్యాపిలిలో 8 మంది గైర్హాజరు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మొదటి రోజు తెలుగు పరీక్షకు 149 మంది విద్యార్థులకు గాను 141 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామకృష్ణయ్య తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

కోవెలకుంట్లలో 16 మంది గైర్హాజరు



కోవెలకుంట్ల: గురుకుల కళాశాలలో వసతులపై ఆరా తీస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్షకు 249 మంది హాజరుకావాల్సి ఉండగా 238 మంది, అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 203 మందికి గాను 198 మంది హాజరైనట్లు చీఫ్ సూపర్‌వైజర్లు రమాదేవి, ఉమాదేవి తెలిపారు. రెండు కేంద్రాల్లో 16 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

బనగానపల్లెలో 49 మంది..

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 220 మంది హాజరుకాగా 13 మంది గైర్హాజరయ్యారు. అలాగే కేజీఆర్ పరీక్ష కేంద్రంలో 282 మందికి గాకు 18 మంది, ఎస్‌వీ జూనియర్ కళాశాలలో 218 మందికి గాను 18 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు ఆనందరావు, విశ్వనాథ్, తిరుమలయ్య తెలిపారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అవుకులో 10 మంది..

అవుకు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆదర్శ పాఠశాల నుంచి 170 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండంగా 160 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ చంద్రసేనారెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ నాగమల్లేష్ యాదవ్ తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు.



అవుకు: పరీక్షలకు హాజరైన విద్యార్థులు



కొలిమిగుండ్ల: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్లలో 8 మంది గైర్హాజరు

కొలిమిగుండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ కళాశాల, మోడల్ స్కూల్‌కు చెందిన కాలేజీ, కస్తూర్బా నుంచి 169 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలను పర్యవేక్షించామన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొలిమిగుండ్ల: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన మాదిగ అమరవీరులకు కొలిమిగుండ్లలోని దండోరా కార్యాలయంలో శనివారం ఘన నివాళులు అర్పించారు. మాదిగ, ఉపకులాల విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కోసం ఎంతో మంది జైలు శిక్ష అనుభవించగా, చాలా మంది కేసులు ఎదుర్కొన్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు గూటం మారెన్నతో పాటు పలువురు నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలదస్తగిరి, నాగపుల్లయ్య, రాయప్ప, నాగన్న, శ్రీనివాసులు, రామచంద్రుడు, అంజి, బాల ఓబులేసు పాల్గొన్నారు.



డోన్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మాదిగ అమరవీరుల దినోత్సవం

డోన్ టౌన్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారిని మాదిగ జాతి ఎప్పటికీ మరిచిపోదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుండాల ఈశ్వర్య మాదిగ అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం మాదిగ అమరవీరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్, అమరావతిలో అమరువీరుల స్థూపాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సభ్యులు పులికేశవయ్య, చినరాయుడు, రామాంజనేయులు, పులి పెద్దయ్య, బాలకేశవులు, రంగన్న, రాము చక్రవర్తి పాల్గొన్నారు.

4న కొత్తకోట పెద్దమ్మ దేవర

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో ఈనెల 4, 5వ తేదీల్లో పెద్దమ్మ దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి

ప్యాపిలి: ప్రభుత్వం విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని యూటీఎఫ్ నాయకులు శాంతిప్రియ, నరసింహారెడ్డి, అబ్దుల్ లతీఫ్, రమేశ్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 9.86 శాతం నిధులు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. 12వ పీఆర్సీ, ఆర్థిక బకాయిల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: రామకృష్ణాపురం ఫీడర్‌లో 11 కేవీ లైన్ నిర్మాణం చేపడుతున్న కారణంగా పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బనగానపల్లె: పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. జుర్రేరువాగుకు అనుసంధానంగా డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఆస్థానం వద్ద జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యత విషయం రాజీపడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పీఆర్ డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ రమణను ఆదేశించారు.

తల్లికి పాదపూజ

డోన్ టౌన్: స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు విద్యార్థులతో పాద పూజ చేయించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని ప్రిన్సిపాల్ గీత తెలిపారు. చిన్నతనం నుంచే పెద్దలను గౌరవించడం, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు.

కష్టజీవుల ఊసేలేని బడ్జెట్

డోన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల వేతనాల పెంపు ఊసేలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య అన్నారు. డోన్‌లోని నక్కిరామన్న భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న మున్సిపల్, వైద్యఆరోగ్యశాఖ, విద్యాశాఖల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఈ బడ్జెట్‌లో కేవలం అభివృద్ధి పేరుతో మాటల గారడి తప్ప ఏమీలేదని ఎద్దేవ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: భర్త, అత్తమామ, బావ వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. పాణ్యం మండలానికి చెందిన యువతికి బేతంచెర్ల పట్టణానికి చెందిన యువకుడితో నాలుగేళ్ల క్రితం వివాహం అయ్యింది. అయితే పిల్లలు పుట్టలేదని మానసికంగా.. శారీకరంగా వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య శనివారం తెలిపారు.

కోలాహలంగా వసంతోత్సవం

- యాగంటిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు వసంతోత్సవం

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు శనివారం వసంతోత్సవం, తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు భక్తులు నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవ కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పరీక్షల సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందుకున్న విద్యార్థులు

బేతంచెర్ల: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సీతారామాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సయ్యద్ వాజీదున్నీసా బీబీ అన్నారు. శనివారం మండల పరిధిలోని సీతారామాపురం జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్షల ప్యాడు, ఫైల్స్, జామెంట్రిక్ బాక్స్‌లను గ్రామానికి చెందిన యువకుడు అశోక్ సహకారంతో అందజేశారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ.3.85 లక్షలు



ప్రత్యేక అలంకరణలో మద్దిలేటి నరసింహస్వామి.



వెండి వస్తువులను బహూకరిస్తున్న దాతలు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామికి శనివారం వివిధ సేవల ద్వారా రూ.3,85,170 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. పాల్గుణ మాసం శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. స్వామివారికి విశేష పూజలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవలి మండలం వేముల గ్రామానికి చెందిన శ్రీరామమూర్తి, మౌనిక 467 గ్రాముల వెండి వస్తువులను స్వామివారికి కానుకగా సమర్పించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థిని

బనగానపల్లె రూరల్: బనగానపల్లె జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థినులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. పర్యావరణ కాలుష్యం, సమతుల ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలు, వర్షాన్ని ముందే పసిగట్టే పరికరం, ఎయిర్ బోటు, చంద్రయాన్ పనిచేసే విధానం, త్రీడీ హాలోగ్రామ్ స్క్రీన్, పేపర్ క్రాఫ్ట్ తదితర నమూనాలను తయారు చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆయా ప్రాజెక్టులను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలగంగాధర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, షాహనాజ్ బేగం, ఫిర్దోస్, నీలమ్మ, నారాయణమ్మ, శైలజప్రియదర్శిణి, శివనాగేశ్వరరావు, లలితా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు ప్రయాణం.. ప్రమాదాలమయం



ఇరుకు రోడ్డులో ప్రయాణిస్తున్న నాపరాళ్ల ట్రాక్టర్

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలోని ప్రధాన వీధిలో ట్రాక్టర్ల రాకపోకలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు ఆపై నాపరాళ్ల ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామం వెలుపల ఉన్న గీతాశ్రమం సమీపంలో నాపరాతి గనులు ఉన్నాయి. గనుల్లో వెలికితీసిన నాపరాళ్లను అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని పాలీష్ ఫ్యాక్టరీలకు ట్రాక్టర్లలో రవాణ చేస్తుంటారు. గీతాశ్రమం, పశువైద్యశాల, దస్తగిరి స్వామి మీదుగా ప్రధాన వీధిలో ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీధికి ఇరువైపులా నివాసాలు ఉన్నాయి. ఇరుకుగా ఉన్న రోడ్డులో ట్రాక్టర్లు ప్రయాణించే సమయంలో బైక్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా ట్రాక్టర్లు వేగంగా వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గీతాశ్రమం నుంచి ప్రధాన వీధిలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా నడివీధిలోనే ట్రాక్టర్లు పోతున్నాయని వాపోయారు. ట్రాక్టర్లు ఊరిలో కాకుండా వెలుపల వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారుతున్న నిర్లక్ష్యం



కమలపురిలో ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు



వృథా అవుతున్న తాగునీరు

సంజామల: మండల పరిధిలోని కమలపురి గ్రామంలో తాగునీరు వృథాగా పారుతున్నాయి. ఇక్కడున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్ పగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అలాగే ముదిగేడు గ్రామంలో ప్రధాన రోడ్డు వద్ద పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. తాగునీరు సైతం కలుషితమవుతోంది. నీరు ఆదా చేయాల్సిన అధికారులే నీరు వృథాగా పారుతున్నా చూసీచూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఎన్జీవోస్ కాలనీలో పగిలిన పైప్‌లైన్

బేతంచెర్ల: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో పార్క్‌కు వెళ్లే రహదారిలో పైపులైన్ పగిలిపోయి 3 నెలలు అవుతున్నా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. నీరంతా వృథాగా పోతోంది. మట్టిరోడ్డుపై నిల్వ చేరుతోంది. రానున్నది వేసవి కాలం, నీటి వృథాను అరికట్టాలని.. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



ముదిగేడులో పైపులైన్ పగిలిపోవడంతో రోడ్డుపై నిలిచిన నీరు